క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



ప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బూసి ప్రసాద్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న ప్రసాద్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, గోలివి జగ్గునాయుడు, బూసి అప్పలనాయుడు, తంగి ప్రసాదరావు, ఎంపీటీసీ కింజరాపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట జంక్షన్ వద్ద పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఓ వ్యక్తి మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద 10 బీరు సీసాలు, 10 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం

సంతకవిటి: మండలంలోని గోళ్లవలస, కె.ఆర పురం, జావాం, కొండగుడేం, కృష్ణవలస పంచాయతీలలో గురువారం వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, నియోజకవర్గ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణరాజు ప్రచారంలో పాల్గొంటారని వెల్లడించారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి ఎమ్మెల్యే శంబంగి ప్రచారం

బాడంగి: మండలంలోని కోడూరు, బాడంగి గ్రామాల్లో శుక్రవారం నుంచి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5న ఉదయం 8 గంటలకు కోడూరులో, మధ్యాహ్నం 3 గంటలకు బాడంగిలో ప్రచారం నిర్వహిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, తెంటు మధుసూదనరావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు ఉన్నారు.

జోరందుకున్న ప్రచారం



మల్లయ్యపేటలో ప్రచారం నిర్వహిస్తున్న పాలవలస శ్రీనివాసరావు, తదితరులు

రాజాం సిటీ: పట్టణంలో వైఎస్సార్‌సీపీ ప్రచారం జోరందుకుంది. ఆదర్శనగర్, మల్లయ్యపేట గ్రామాల్లో బుధవారం రాత్రి ప్రచారం చేపట్టారు. పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. మన అందరికీ సుపరిచితుడైన డాక్టర్ రాజేష్‌ను గెలిపించడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని కోరారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే మళ్లీ సంక్షేమం కొనసాగుతుందన్నారు.

రామాలయంలో ఎమ్మెల్యే పూజలు

బొబ్బిలి: పట్టణంలోని గోనా వారి వీధిలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఉత్సవ కమిటీ, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి ప్రతిష్ఠోత్సవం

బొబ్బిలి: మండలంలోని కృష్ణాపురంలో ఎల్లమ్మతల్లి గుడి ప్రతిష్ఠోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నిష్టల ధర్మారావు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అదుపులోకి మంటలు

రాజాం సిటీ: మండలంలోని గార్రాజుచీపురుపల్లి వద్ద ఉన్న డంపింగ్ యార్డులో ఏర్పడిన మంటలు బుధవారం అదులోకి వచ్చాయని కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు అంటుకున్నాయి. దట్టమైన పొగ వ్యాప్తి చెందడంతో పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు.

పింఛన్.. టెన్షన్

ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకుని ప్రతిపక్ష కూటమి చేసిన కుట్రలకు అవ్వాతాతలు, దివ్యాంగులు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. ఇన్నాళ్లూ ప్రతీ నెల ఒకటో తేదీన గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్ డబ్బులు తీసుకొచ్చి ఇచ్చేవారు. అయితే టీడీపీ నేతలు, వారి అనుబంధ సంస్థ చేసిన నిర్వాకంతో వలంటీర్లు పింఛన్ల పంపిణీకి దూరంగా ఉండాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా లబ్ధిదారులు గ్రామ సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. బుధవారం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా.. పింఛన్ డబ్బుల కోసం పండుటాకులు గ్రామ సచివాలయాల వద్ద మండుటెండలో పడిగాపులు కాస్తూ కనిపించారు. ఐదేళ్ల కిందట పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ టీడీపీ నేతలను దుమ్మెత్తిపోస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: నెమలాం గ్రామ సచివాలయం వద్ద పింఛన్ డబ్బుల కోసం క్యూలో నిలుచున్న వృద్ధులు



వంగర: పింఛన్ల కోసం వంగర సచివాలయం నిరీక్షిస్తున్న వృద్ధులు



రాజాం: సత్యనారాయణపురం సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ఫించన్ లబ్ధిదారులు



రాజాం సిటీ: కంచరాంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు



తెర్లాం: పింఛన్ల కోసం సచివాలయం-2 ఎదురుగా ఉన్న చెట్ల కింద వేచి ఉన్న లబ్ధిదారులు



బొబ్బిలి: సాయంత్రం 6 గంటల సమయంలో అగురు వీధి సచివాలయంలో లబ్ధిదారుల నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న సచివాలయ సిబ్బంది



బొబ్బిలి: వంతరాం రోడ్డు సచివాలయంలో లబ్ధిదారులకు పింఛను నగదు ఇప్పిస్తున్న కమిషనర్ రామలక్ష్మి



రామభద్రపురం: రామభద్రపురంలో పింఛన్లు తీసుకునేందుకు రాత్రి 7 గంటల సమయంలో క్యూలో నిలుచున్న లబ్ధిదారులు

జగనన్నతోనే జనరంజక పాలన

- ఎమ్మెల్సీ విక్రాంత్, రాజాం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ రాజేష్



ఆగూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ తలే రాజేష్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని, ఈ పాలన ఇలానే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని ఆగూరు, అమరాం, గడిముడిదాం తదితర గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గతంలో టీడీపీ ప్రభుత్వం లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఐదేళ్లు ప్రజలకు ఏమీ చేయకుండా.. జన్మభూమి కమిటీలతో ప్రజాధానాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో మరోసారి అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విక్రాంత్, తలే రాజేష్‌కు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్శింహులు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, స్థానిక సర్పంచ్ అనూష, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, టౌన్ యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, ఎంపీటీసీ వాసు, బింగి కృష్ణ, మాజీ ఎంపీటీసీ సామంతుల వెంకటప్పలనాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ ముదిలి జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌ఓ) భాస్కరరావు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఓపీ, మందుల రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి రత్నదీపక్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షలకు వస్తున్న రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి నెల కనీసం 5 నుంచి 10 వరకు ప్రసవాలు పీహెచ్‌సీలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వడదెబ్బతో అప్రమత్తం..

ఎండ తీవ్రత కారణంగా ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, ఈ మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తలనొప్పి, తీవ్రమైన జ్వరం, మూత్రం రాకపోవడం, అపస్మారక స్థితిలోకి వెళ్లడం, సొమ్మసిల్లి పోవడం వంటి లక్షణాలు ఉంటే వడదెబ్బ తగిలినట్లు భావించి వెంటనే తగిన చికిత్స అందించాలని సూచించారు. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీరు, పండ్ల రసం వంటివి తీసుకోవాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, క్యాప్, రుమాలు తప్పనిసరిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బొబ్బిలి: ఎండ తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యాంసుందరరావు అన్నారు. పట్టణంలోని మన గ్రోమోర్ బ్రాంచ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. వివిధ ఉత్పత్తుల కోసం వచ్చే రైతుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

పింఛన్ల పంపిణీ వేగవంతానికి చర్యలు



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ సీహెచ్ ఈశ్వరమ్మ, తహసీల్దార్ సులోచనరాణి



సంతకవిటి: కార్యదర్శులు, వీఆర్వోలకు సూచనలు చేస్తున్న అధికారులు

బాడంగి: గ్రామ సచివాలయ కేంద్రంతో పాటు సచివాలయ పరిధిలోని గ్రామాల్లో కూడా పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశమై పలు సూచనలు చేశారు. హేమ్లట్ గ్రామాల్లోని ప్రభుత్వ భవనాల వద్ద పింఛన్ల పంపిణీకి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల 4,5,6 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. సమావేశంలో తహసీల్దార్ రాజారావు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

రామభద్రపురం: లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ సీహెచ్ ఈశ్వరమ్మ, తహసీల్దార్ ఎ.సులోచనరాణి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వలంటీర్ల ప్రమేయం లేకుండా పింఛన్లు పంపిణీ చేపట్టాలని సూచించారు. గతంలో మాదిరిగా సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఇతర ఏదైనా గుర్తింపు కార్డు వెంటతీసుకుని రావాలని, పింఛన్ పుస్తకం తీసుకురావొద్దని సూచించారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున ఉపాధి పనుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఓకు సూచించారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

సంతకవిటి: పింఛన్ల కోసం సచివాలయాలకు వచ్చే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పైడితల్లి, తహసీల్దార్ తిరుమలరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. సచివాలయంలో తాగునీరు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ బూత్‌ల వద్ద విద్యుత్, ర్యాంపులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

టీడీపీలో ఇమడలేం..



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రాజాం: తమకు గుర్తింపు, గౌరవం లేని వివాదాల పార్టీలో తాము ఇమడలేమని వాపోతూ మండలంలోని ఆగూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన కోనారి కాశింనాయుడు, కోనారి భవానీనాయుడు, కోనారి గంగునాయుడు, గణేష్, రాధాకృష్ణ, తిరుపతిరావు, రామారావు, అంజిబాబుతో పాటు మరో 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్ ఉన్న నాయకుడని అన్నారు. టీడీపీలో క్రమశిక్షణ కొరవడిందని, కుమ్ములాటలు ఎక్కువయ్యాయని అన్నారు. పెత్తందారులకు, దోపిడీదారులకు టికెట్లు ఇస్తున్నారని వాపోయారు. అందుకే క్రమశిక్షణ కలిగిన వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో తలే రాజేష్‌ను ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ దుశ్చర్యలను ప్రజలకు తెలియజేయండి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమం అందించకుండా ఏళ్ల పాటు ప్రజల నడ్డి విరిచిన చంద్రబాబు అండ్ కో దుశ్చర్యలు, దాష్టీకాలను ప్రజలకు మరోమారు వివరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పాత బొబ్బిలిలో బుధవారం రాత్రి నిర్వహించిన బూత్ లెవెల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జన్మభూమి కమిటీలతో ప్రజలను సంక్షేమానికి దూరం చేసిన చంద్రబాబుకు, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మధ్య నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. మళ్లీ సంక్షేమాన్నిచ్చే జగనన్న ప్రభుత్వాన్ని తెచ్చుకుందామన్నారు. సమావేశంలో జేసీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి శంబంగి శ్రీకాంత్, పట్టణ ఇన్‌ఛార్జి రేజేటి ఈశ్వరరావు(విను), వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌ఛార్జి శంబంగి వేణుగోపాలనాయుడు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ మహేంద్ర



రేగిడి: కొండవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

రేగిడి: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని బొబ్బిలి డీఎస్పీ మహేంద్ర కోరారు. మండలంలో కొండవలస గ్రామంలో బుధవారం ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిపించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని, ప్రజలు కూడా తమ వంతు సాయం అందించాలని కోరారు. గ్రామాల్లో చిన్నచిన్న గొడవలు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. గ్రామాల్లో మద్యం, గుట్కా, మత్తుపానీయాలను ఉంచరాదని సూచించారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

వంగర: గ్రామాల్లో ప్రజలు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై వై.వి.జనార్దన్ సూచించారు. మండలంలోని ఇరువాడ, చంద్రంపేట, చౌదరివలస గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా మెలగాలని, వివాదాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి పనుల వద్ద జాగ్రత్తలు తప్పనిసరి



రాజాం: ఉపాధి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఉపాధి పనుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల పనులు చేయించాలని, పని ప్రదేశంలో నీడ, తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నిర్దేశిత కొలతల మేరకు పనులు పూర్తిచేస్తే కనీస వేతనం రూ.300లు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై సమీక్ష

సంతకవిటి: స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం 34 పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఏపీఓ హరనాథరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు పూటలా కొలతల ప్రకారం పనిచేస్తే దినసరి వేతనం రూ.300 గిట్టుబాటు అవుతుందన్నారు. పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, టెంట్లు వేయాలని, వీలుకాని పక్షంలో చలువ పందెర్లు వేయాలని సూచించారు. ప్రతి జాబ్‌కార్డుపై వంద రోజులు పని కల్పించాలన్నారు.

పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలి

బొబ్బిలి: ఎండ తీవ్రతతో వేతనదారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఉపాధి పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ జనార్దనరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రసహాయకులు, ఈసీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎండలు పెరుగుతున్నందున ఉపాధి పనుల వద్ద చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, ఉదయం 7 నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు చేయించాలని సూచించారు. మస్తర్ల నమోదులో పారదర్శకత పాటించాలన్నారు. ఏపీఓ లక్ష్మీపతిరాజు, ఈసీ కల్యాణ్ చక్రవర్తి ఉన్నారు.



